సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం ; 4 ; అక్టోబర్ ; 2024



ఎంసీహెచ్‌లో అరకొర సేవలు

జిల్లాలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో డాక్టర్లు, సిబ్బంది కొరతతో వైద్య సేవలు సరిగా అందక కాన్పుల సంఖ్య తగ్గుతోంది. 8లో



..మహిళలను కాపాడుకుందాం

ప్రకృతి, మహిళలను కాపాడుకుందామనే నినాదంతో బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు ప్రజా గాయని విమలక్క చెప్పారు. 8లో

గరిష్టం / కనిష్టం

34° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా డిజిటల్ సర్వే

జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్



సర్వేను పరిశీలిస్తున్న సురేంద్రమోహన్

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ కార్డ్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ అన్నారు. పట్టణంలోని పదో వార్డును పైలట్ ప్రాజెక్ట్‌గా గుర్తించి సర్వే చేపడుతుండగా గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలు లేకుండా సర్వే చేయాలని, కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. కుటుంబ యజమానిగా మహిళ పేరే ఉండాలని, కుటుంబ సభ్యుల అంగీకారంతోనే మొబైల్ ఫోన్‌లో ఫొటో తీయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు, తహసీల్దార్ వివేక్, ఆర్‌ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్‌లో 74 మందికి 49 మంది, పదో తరగతిలో 62 మందికి 46 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. పరీక్షల సహాయక కమిషనర్ ఎస్.మాధవరావు రెండు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం బాబు క్యాంప్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. స్టాఫింగ్స్ టైటాన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వివిధ పోస్టుల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తుండగా ఎంపికైన వారు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఎస్సెస్సీ మొదలు డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు గలవారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు శనివారం ఉదయం పది గంటలకల్లా బయోడేటా సర్టిఫికెట్లతో హాజరుకావాలని, వివరాలకు 90596 40088 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

8 వరకు వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు



డీర్‌పార్కు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్ : ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బి.బాబు తెలిపారు. గురువారం ఆయన కిన్నెరసాని డీర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కు పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం మాట్లాడుతూ.. కిన్నెరసాని డీర్ పార్కును ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కాగా, శుక్రవారం అటవీ శాఖ డివిజనల్ సిబ్బందితో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. వారం రోజులపాటు రోజుకో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

401 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ 2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోందని, గురువారం 401 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీల ధ్రువపత్రాలను పరిశీలించామని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి రోజు 150 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించామని పేర్కొన్నారు. ఇంకా 460 మంది అభ్యర్థుల పత్రాల వెరిఫికేషన్ చేయాల్సి ఉందని, ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అదనంగా మరో ఐదు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఐదో తేదీ నాటికి పూర్తవుతుందని, అభ్యర్థులంతా ఈ లోపు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

ఆర్‌సీఎస్‌కు అడుగులు

త్వరలో రీజనల్ కేన్సర్ సెంటర్ ఏర్పాటు

- కేన్సర్ వైద్య సేవల విస్తరణపై సర్కారు నజర్
- ప్రాథమిక దశలోనే వ్యాధి నిర్ధారణ, చికిత్స
- కొత్తగూడెంలో ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు



రీజనల్ కేన్సర్ సెంటర్ ఏర్పాటు చేయనున్న కొత్తగూడెంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ప్రజలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో అతి త్వరలోనే కేన్సర్ చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా కొత్తగూడెంలో రీజనల్ కేన్సర్ సెంటర్(ఆర్‌సీఎస్) ఏర్పాటు కానుంది. ఈ మేరకు చకచకా అడుగులు పడుతున్నాయి.

విస్తృత సేవలకు కసరత్తు..

దేశ వ్యాప్తంగా మధుమేహం, కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. ఇప్పటికే మధుమేహానికి అందించే చికిత్సలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతం చేశాయి. ఇప్పుడు కేన్సర్ వ్యాధిగ్రస్తులను ఆదిలోనే గుర్తించి సరైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే హైదరాబాద్, వరంగల్ వంటి ప్రధాన నగరాల్లో ఉన్న కేన్సర్ చికిత్స కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. దీంతో పాటు పాత జిల్లాల వారీగా రీజనల్ కేన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలి దశలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి కొత్తగూడెంలో నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది.

నాలుగు రాష్ట్రాల ప్రజలకు..

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌లోని ఎస్ఎంజీ కేన్సర్ సెంటర్లోనే పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి. ఈ ఆస్పత్రికి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వ్యాధిగ్రస్తులు వస్తున్నారు. పైగా కేన్సర్ వైద్య చికిత్సలు సుదీర్ఘ కాలం కొనసాగించాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్ర రాజధానిలో ఉచిత కేన్సర్ చికిత్స కోసం రోజులు, నెలల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. పైగా చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు అందరూ ఇక్కడికే రావాల్సి వస్తోంది. కొత్తగా రీజనల్ కేన్సర్ సెంటర్లు అందుబాటులోకి వస్తే ప్రాథమిక స్థాయిలో వ్యాధిని గుర్తించడంతో పాటు తొలి చికిత్సను ఇక్కడే అందించే అవకాశం ఉంటుంది. కొత్తగూడెంలో రీజనల్ సెంటర్ ఏర్పాటు చేస్తే గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గిరిజనులకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. మరోవైపు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు ఈ సెంటర్ అందుబాటులో ఉంటుంది.

హృద్రోగ సేవలు కూడా మొదలైతే..

కొత్తగూడెం ఏరియా ఆస్పత్రి ప్రస్తుతం బోధనాస్పత్రిగా మారింది. దీంతో ఇక్కడ సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల ట్రామా కేర్ సెంటర్ కూడా మంజూరైంది. ఇప్పుడు రీజినల్ కేన్సర్ సెంటర్ వచ్చేందుకు బాటలు పడుతున్నాయి. ఇదే ఒరవడిలో సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వ రంగంలో గుండె సంబంధిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గిరిజన జనాభా ఎక్కువగా ఉండే ఏజెన్సీ ప్రాంతంలో ఇటు ప్రైవేట్, అటు ప్రభుత్వ రంగంలో కనీస స్థాయిలో కూడా గుండె సంబంధిత వైద్య సేవలు అందుబాటులో లేవు. ఎవరికైనా హెల్త్ ఎమర్జెన్సీ వస్తే హుటాహుటిన ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడున్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్డియాలజీ విభాగంలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తేవాలని వైద్య రంగ నిపుణులు సూచిస్తున్నారు.

రూ.50 కోట్ల వ్యయంతో..

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. కొత్తగూడెంలో ఉన్న బోధనాస్పత్రిలో ఈ కేన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ వ్యాధి లక్షణాలను గుర్తించడంతో పాటు చికిత్స చేస్తారు. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయడంతో పాటు ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తారు. ఇప్పటికే ఉన్న రేడియాలజీ విభాగాన్ని మరింత పటిష్టం చేస్తారు. దీంతో పాటు హైదరాబాద్‌లో ఉన్న ఎస్ఎంజీ కేన్సర్ ఆస్పత్రి వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ చికిత్స కొనసాగించేలా టెలీ/వీడియో మెడిసిన్ విధానాలు అందుబాటులోకి తెస్తారు. ఇందుకోసం ఒక్కో రీజనల్ కేన్సర్ సెంటర్ నిర్మాణానికి రూ.50 కోట్లు వ్యయం చేయనున్నారు.

డిజిటల్ సర్వే పటిష్టంగా చేపట్టాలి

- ప్రతీ కుటుంబ వివరాలు నమోదు చేయండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



ఇల్లెందు మండలం పూబెల్లిలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇల్లెందురూరల్/కొత్తగూడెంరూరల్/భద్రాచలం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ కార్డు సర్వేను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండలం లాల్‌తండా, ఇల్లెందు మండలం పూబెల్లితో పాటు భద్రాచలంలోని 9వ వార్డులో చేపట్టిన సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కుటుంబ గుర్తింపు కోసమే సర్వే జరుగుతోందని, ఇందులో అపోహలకు తావులేదని అన్నారు. కుటుంబంలో ఎక్కువ వయసున్న మహిళ పేరున డిజిటల్ కార్డు వస్తుందని, ఇతర కుటుంబ సభ్యులకు కూడా గుర్తింపు సంఖ్య ఉంటుందని తెలిపారు. రేషన్, ఆరోగ్యం, ఇతర స్వయం ఉపాధి పథకాలు అర్హులైన కుటుంబాలకు నేరుగా అందించడానికే ఈ సర్వేను చేపట్టినట్లు చెప్పారు. కుటుంబసభ్యులు అనుమతిస్తే సర్వే అధికారులు గ్రూప్ ఫొటో తీస్తారని చెప్పారు. ప్రజలంతా సర్వే అధికారులకు సహకరించాలని కోరారు.

ఏడు గ్రామాలు.. మూడు మున్సిపాలిటీలు..

పైలట్ పద్ధతిన డిజిటల్ కార్డు సర్వేకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఏడు గ్రామాలు, మూడు మున్సిపాలిటీల్లోని వార్డులను ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలం లాల్‌తండా పంచాయతీలో 171 కుటుంబాలు, పాల్వంచ మున్సిపాలిటీ పదో వార్డులో 330, దమ్మపేట మండలం ఆళ్లపల్లిలో 175, ములకలపల్లి మండలం ముత్యాలపాడులో 178, అశ్వాపురం మండలం చండ్రలపాడులో 190, మణుగూరు మున్సిపాలిటీలోని ఆరో వార్డులో 248, చర్ల మండలం పులిగుండాలలో 190, భద్రాచలంలోని తొమ్మిదో వార్డులో 280, ఇల్లెందు మండలం పూబెల్లిలో 172, ఇల్లెందు మున్సిపాలిటీలోని 19 వార్డులో 310 కుటుంబాలను సర్వే చేస్తామని వివరించారు. ఎలాంటి తప్పుల్లేకుండా కుటుంబ వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు, తహసీల్దార్ శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ డీటీ మహేష్, ఇల్లెందు నియోజకవర్గ ప్రత్యేకాధికారి కాశయ్య, ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు అజహర్, బాలకృష్ణ, మాజీ ఎంపీపీ చీమల నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్ రూపొందించండి

భద్రాచలం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు సరిపడా వసతులు కల్పించేలా ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆలయ ఈఓ రమాదేవికి సూచించారు. డిజిటల్ సర్వే పరిశీలన అనంతరం ఆయన ఆలయ పరిసరాలు, మిథిలా స్టేడియాన్ని పరిశీలించారు. ప్రసాద్ పథకం ద్వారా చేస్తున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వరదల సమయంలో అన్నదాన సత్రంలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతీ భక్తుడికి అన్నప్రసాదం అందేలా ఏర్పాట్లు చేయాలని ఈఓను ఆదేశించారు.

సర్టిఫికెట్ల పరిశీలనలో వేగం పెంచండి

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ - 2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఐదో తేదీ నాటికి పూర్తి కావాలని, అవసరమైతే మరి కొందరు సిబ్బందిని నియమించుకుని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలనను గురువారం ఆయన తనిఖీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి సందేహాలున్నా తక్షణమే నివృత్తి చేయాలని డీఈఓకు సూచించారు. ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసుకోవాలని అభ్యర్థులను కోరారు. అనంతరం వివిధ కౌంటర్లలో ధ్రువపత్రాలను పరిశీలనను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, రెండో రోజైన గురువారం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.

నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు

తొలిరోజు ఆదిలక్ష్మి అలంకరణలో అమ్మవారు



చిత్రకూట మండపంలో స్వామివారు

భద్రాచలం : భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. మహాలక్ష్మి అమ్మవారు తొలిరోజు ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. అమ్మవారికి ఈనెల 12వ వరకు రోజుకో అలంకరణ చేయనున్నారు.

శ్రీరామాయణ పారాయణం ప్రారంభం..

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిత్రకూట మండపంలో శ్రీరామాయణ మహా పారాయణం గురువారం ప్రారంభమైంది. స్వామి వార్లను ఊరేగింపుగా తీసుకొచ్చి మండపంలో కొలువుదీర్చారు. పారాయణం చేసే స్థానాచార్యులు స్థలశాయి, వేద పండితులకు ఆలయ ఈఓ రమాదేవి స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. తొలిరోజు బాలకాండ పారాయణంతో క్రతువు వైభవంగా ప్రారంభమైంది. రెండో రోజైన శుక్రవారం అయోధ్యకాండ పారాయణం చేయనున్నారు. ఇక ప్రతీ రోజు శ్రీలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో అభిషేకం, సామూహిక కుంకుమార్చన తదితర పూజలు జరగనున్నాయి.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

రామాలయంలో గురువారం స్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో..



శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు అమ్మవారి మండపం వద్ద గణపతి పూజ, పుణ్యావాచనం, రుత్వికరణ, దీక్షా వస్త్ర ధారణ, అఖండ దీపారాధన, గోపూజ నిర్వహించారు. కాగాచ తొలిరోజున అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కలశస్థాపన పూజలకు హాజరు కాగా, ఈఓ రజనీకుమారి ఆయనకు అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎస్‌కె.సాబిర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, ఉప్పుశెట్టి రాహుల్, చందుపట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు .

ఈ భారం మోయలేం..

- ఆందోళన బాట పట్టిన వ్యవసాయ విస్తరణాధికారులు
- డిజిటల్ క్రాప్ సర్వే చేయలేమని స్పష్టీకరణ
- ఇప్పటికే ప్రజాప్రతినిధులు, కలెక్టర్, డీఏఓకు వినతులు
- నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఈఓలు (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమపై మోయలేని భారం మోపుతున్నారంటూ జిల్లాలోని వ్యవసాయ విస్తరణాధికారులు ఆందోళన బాట పట్టారు. పని భారం తగ్గించాలని కోరుతూ ప్రజాప్రతినిధులకు, కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారికి ఇటీవల వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేసిన ఏఈఓలు.. గత నెల 28న కార్యాచరణ రూపొందించారు. మొదట జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల వద్ద నల్లబ్యాడ్జీల ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వేతో తమపై పని భారం పడుతున్నందున అదనపు సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ సర్వేకు గ్రామానికి ఒక పర్మనెంట్ లేదా తాత్కాలిక ప్రాతిపదికన సర్వేయర్‌ను నియమించారని, తెలంగాణలోనూ ఇదే విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలా నియమించిన తర్వాతే సర్వే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

జిల్లాలో 67 మంది ఏఈఓలు..

జిల్లాలో వ్యవసాయ విస్తరణాధికారుల పరిధిలో 6,37,000 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణాధికారి ఉండాలనేది ప్రభుత్వ నిబంధన. ఈ ప్రాతిపదికన జిల్లాలో 128 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం 67 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే తమపై ఒత్తిడి పెరుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఐదు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన క్లస్టర్లు 45 ఉన్నాయని, ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకుని సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు. తాము 49 రకాల విధులు నిర్వహించాల్సి వస్తోందని, గ్రామాల్లో ఎలాంటి సహాయకులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు. విలేజ్ అసిస్టెంట్లను నియమించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఈఓల సంఘం రాష్ట్ర నాయకులు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌తో చర్చలు జరిపారు. డిజిటల్ క్రాప్ సర్వేకు కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లో అదనపు సిబ్బందిని నియమిస్తున్నారని, లేదంటే ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగిస్తున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఈ విషయమై ఇంతవరకూ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

వీఏఏలను నియమించాలి



ఇప్పటికే పనిభారంతో సతమతం అవుతున్న మాకు డిజిటల్ క్రాప్ సర్వే బాధ్యతలు అప్పగించడం సరికాదు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్, మా శాఖ జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లాం. వీఏఏలను నియమించాలని కోరాం. అలా చేస్తే మా విధులను సమర్థంగా నిర్వహించగలుగుతాం.

– బందెల నరసింహారావు, ఏఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించాలి



ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. తలకు మించిన పని భారంతో సతమతం అవుతున్నాం. ఇప్పటికే నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై మా నిరసన తెలియజేశాం. సమస్య పరిష్కారానికి అందరం సంఘటితంగా పోరాడుతాం. ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

–పర్సా శ్రీనివాస్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేస్తాం



ఏఈఓల సమస్యలపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటే దానినే మేం అమలు చేస్తాం. జిల్లాలోని ఏఈఓలు వారి సమస్యలు తెలియజేస్తూ మాకు వినతిపత్రం ఇచ్చారు. దాన్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం.

– వి బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

సెప్టెంబర్‌లోనూ అంతంతే...

- సింగరేణి వ్యాప్తంగా 72 శాతమే బొగ్గు ఉత్పత్తి
- గతనెలలో వర్షాలతో తగ్గిన వైనం
- ఇల్లెందు ఏరియాలో మాత్రం 123 శాతంతో భేష్



ఓసీలో బొగ్గు లోడ్ చేస్తున్న వాహనాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గడిచిన సెప్టెంబర్‌లో నిర్దేశించిన 51.99 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 37.46 లక్షల టన్నుల మేర (72శాతం) మాత్రమే ఉత్పత్తి నమోదైంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం ఆరు నెలల్లో 31.58 మిలియన్ టన్నులకు గాను 28.44 మిలియన్ టన్నుల(90 శాతం) ఉత్పత్తి నమోదైందని సంస్థ గణాంకాలు విడుదల చేశారు. సింగరేణి ఆరు జిల్లాల్లో విస్తరించి ఉండగా 11ఏరియాలకు గాను నెలనెలా లక్ష్యాలను నిర్దేశించారు. అయితే సెప్టెంబర్‌లో ఒక్క ఇల్లెందు ఏరియా మాత్రమే 123శాతం సాధించగా, మిగిలిన 10 ఏరియాలు వెనుకంజలో ఉన్నాయి. కొత్తగూడెం ఏరియా 87శాతం, మణుగూరు 62, బెల్లంపల్లి ఏరియా 49, మందమర్రి ఏరియా 62శాతం, శ్రీరాంపూర్ ఏరియా 61శాతం, ఆర్జీ-1 ఏరియా 82శాతం, ఆర్జీ-2 ఏరియా 59శాతం, ఆర్జీ-3 ఏరియా 84శాతం, ఆండ్రియాలా ప్రాజెక్ట్ 76శాతం, భూపాలపల్లి 59శాతంతో సరిపెట్టుకున్నాయి.

దెబ్బతీసిన భారీ వర్షాలు

సింగరేణి వ్యాప్త జిల్లాల్లో సెప్టెంబర్ మొదటివారంలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఆగస్టులో 83శాతం ఉత్పత్తి సాధించగా, సెప్టెంబర్‌లో 72శాతానికే పరిమితమైంది. సంస్థ వ్యాప్తంగానే కాక అన్ని ఏరియాల్లోనూ ఇదే పరిస్థితి ఉండడం గమనార్హం. కాగా, వర్షాలు కురిసినప్పుడల్లా బొగ్గు ఉత్పత్తి తగ్గుముఖం పడుతోంది. ఈ నేపథ్యాన ఉన్నతాధికారులు కోలిండియా పరిధిలోని పలు గనుల్లో పరిశీలించారు. అక్కడి విధానాలను ఇక్కడా అమలుచేస్తే వర్షాలు కురిసినా ఉత్పత్తికి విఘాతం కలగదనే భావనతో పర్యటనకు వెళ్లారు. కానీ వారి పర్యటనలో ఏం గమనించారో, ఇక్కడ ఏం అమలుచేశారో తెలియదు కానీ ఫలితం మాత్రం లేకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

గడిచిన ఆరు నెలల్లోనూ అంతే...

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 11 ఏరియాల్లో 31.58 మిలియన్ టన్నుల లక్ష్యానికి 28.44 మిలియన్ టన్నుల(90 శాతం) ఉత్పత్తి నమోదైంది. ఆరు మాసాల్లో ఇల్లెందు ఏరియా 117 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, ఆర్జీ-2 ఏరియా 109 శాతం ఉత్పత్తి సాధించాయి. ఇవి కాక కొత్తగూడెం ఏరియాలో 93 శాతం, మణుగూరులో 89, బెల్లంపల్లి ఏరియాలో 86శాతం, మందమర్రి ఏరియా 78 శాతం, శ్రీరాంపూర్ ఏరియా 71శాతం, ఆర్జీ-1 ఏరియా 86శాతం, ఆర్జీ-3 ఏరియా 94 శాతం, ఆండ్రియాల ప్రాజెక్ట్ 94 శాతం, భూపాలపల్లి 67 శాతం ఉత్పత్తితో వెనుకంజలో ఉన్నాయి. కాగా, సంస్థ వ్యాప్తంగా 18 ఓసీల్లో గడిచిన ఆరు నెలలకు 28.46 మిలియన్ టన్నుల లక్ష్యంలో 25.97మిలియన్ టన్నులు(91 శాతం), 22 భూగర్భగనుల్లో 31.96 లక్షల టన్నులకు గాను 24.73 లక్షల టన్నులు(79శాతం) ఉత్పత్తి సాధించాయి. అదేవిదంగా రోజువారి ఉత్పత్తిలో ఓసీలలో 73శాతం, భూగర్భగనుల్లో 66 శాతం సాధించాయి.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులతో కోచ్‌లు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 5, 6వ తేదీల్లో జరగనున్న తెలంగాణ బాక్సింగ్ ఓపెన్ స్టేట్ టోర్నమెంట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.రమేష్, కోచ్ సత్యబాబు తెలిపారు. గురువారం కొత్తగూడెం ప్రగతిమైదానంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పోటీలకు అండర్–14 విభాగంలో ఆర్.గణేష్(32 కేజీలు), కె.అరుణ్ (55 కేజీలు), యుగ్ అగర్వాల్ (48 కేజీల) విభాగంలో ఎంపికయ్యారని తెలిపారు. అండర్–16లో తేజ్‌దీప్ (60 కేజీలు), చాణక్య (56 కేజీలు), ఫైమా(48 కేజీలు), అభినవ్ (52 కేజీలు)లు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలి

సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి


బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు

మణుగూరు టౌన్: భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి సూచించారు. గురువారం మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ, ఓసీ–2, ఓసీ–4 గనులను వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. క్వారీలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియా వార్షిక ఉత్పత్తి లక్ష్యం 126.5 లక్షల టన్నులను సాధించాలని చెప్పారు. ఓబీ వెలికితీతపై దుర్గా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వేగవంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు శ్యాం సుందర్, లక్ష్మీపతిగౌడ్, పీఓ వీరభద్రరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరభద్రుడు, లింగబాబు, చిట్ల శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి కట్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

జేకే–5 ఓసీ విస్తరణకు అనుమతులు?

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందులో ఏరియాలో జేకే–5 ఓసీ విస్తరణకు అనుమతులు లభించినట్లు తెలిసింది. గురువారం మినిట్స్ ఆఫ్ ద మీటింగ్ ద్వారా క్లియరెన్సు లభించింది. ఏడాది కాలంగా సింగరేణి అధికారులు ఫారెస్టు క్లియరెన్సు కోసం కేంద్ర అటవీశాఖతో సంప్రదింపులు జరుపుతున్నారు. మినిట్స్ మీటింగ్ ద్వారా అనుమతులు లభించాయని, వారంలోపు ఆదేశాలు అందుతాయని సింగరేణి అధికారులు తెలిపారు. మరో రెండు నెలల్లో ప్రాజెక్టు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నిరుపేద విద్యార్థులకు 'గౌతమీస్ఫూర్తి' చేయూత


నగదు అందుకున్న విద్యార్థులతో అధికారులు, ఫౌండేషన్ సభ్యులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు లేని, నిరుపేద విద్యార్థులు 26 మందికి భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా చేయూతనిచ్చారు. ఒక్కో విద్యార్థికి రూ.5వేల చొప్పున రూ.1.30లక్షల ఆర్థిక సాయాన్ని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గురువారం అందజేశారు. గత మూడేళ్లుగా ఈకార్యక్రమం కొనసాగిస్తుండగా 2021లో రూ.95వేలు, 2022లో రూ.లక్ష, 2023లో రూ.1.30లక్షలు అందజేసినట్లు ఫౌండేషన్ బాధ్యులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ శేషుబాబు, ఫౌండేషన్ సభ్యులు సోమయ్య, బేతి రమేష్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువులు స్వాధీనం

భద్రాచలంటౌన్: భద్రాచలం మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువులను ఎస్‌ఐ విజయలక్ష్మి గురువారం పట్టుకున్నారు. దుమ్ముగూడెం నుంచి సుజాతనగర్‌కు రెండు టాటా ఏస్ వాహనాల్లో ఆరు పశువులను తరలిస్తుండగా పట్టుకుని పాల్వంచ గోశాలకు తరలించారు. పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

ఎంసీహెచ్‌లో అరకొర వైద్యసేవలు

- బదిలీ అయిన డాక్టర్ల స్థానంలో ఎవరినీ నియమించని వైనం
- వైద్యుల్లేక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్న గర్భిణులు
- నెల రోజుల్లోనే తగ్గిన కాన్పుల సంఖ్య 150
- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్న జిల్లా ప్రజలు


జిల్లా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో బాలింతలు

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యుల కొరతతో కాన్పుల సంఖ్య తగ్గుతోంది. జిల్లా నలుమూల నుంచి రోజూ 300 వరకు గర్భిణులు ఇక్కడ ఓపీ సేవలు పొందుతారు. ఇతర రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా వైద్య సేవలకోసం వస్తారు. కానీ డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడంలేదు.

ఏడుగురు బదిలీ.. మిగిలింది ముగ్గురే..

గత నెలలో ముగ్గురు ఎస్‌ఆర్‌లు (సీనియర్ రెసిడెంట్‌లు), గైనకాలజిస్టు సరళ, ముగ్గురు పిల్లల వైద్యులు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సింధూజ, సాగరిక, గైనకాలజిస్‌టెట్ బసంతి ఉన్నారు. ముగ్గురి వైద్యులు ఓపీతోపాటు ఎక్కువ సర్జరీలు చేయటం సాధ్యం కావటంలేదు. వారిపై పని భారం అధికంగా పడుతోంది. ఫలితంగా ఆగస్టులో 355 మంది కాన్పులుకాగా, సెప్టెంబర్‌లో 205 మందికే కాన్పులు చేశారు. నెల వ్యవధిలోనే కాన్పుల సంఖ్య 150 వరకు తగ్గింది. రేడియాలజిస్ట్ లేకపోవడంతో గత నెల 1 నుంచి ఎంసీహెచ్ ఆస్పత్రిలో గర్భిణులకు స్కానింగ్ సేవలు అందించడం లేదు. ఒక్కో గర్భిణికి బిడ్డ పుట్టేవరకు నాలుగుసార్లు స్కానింగ్ తీయాల్సిఉంటుంది. రేడియాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులను కొత్తగూడెం పట్టణంలో ఉన్న జిల్లా సర్వజన ఆస్పత్రికి పంపించి, స్కానింగ్ తీస్తున్నారు. ఎంసీహెచ్ నుంచి సర్వజన ఆస్పత్రికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో గర్భిణులు స్కానింగ్‌కు వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రక్తం అవసరమైనా సర్వజన ఆస్పత్రిని నుంచే తీసుకురావాల్సి వస్తోంది.

ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకతప్పడంలేదు..

ఎంసీహెచ్‌లో సెప్టెంబర్‌లో 5,050 మంది ఓపీ సేవలు పొందారు. 205 కాన్పులు జరగ్గా, వీటిలో 114 సిజేరియన్ చేశారు. మిగతావి సాధారణ కాన్పులు జరిగాయి. గత ఆగస్టులో 6,600 మంది ఓపీ సేవలు పొందారు. ఇందులో 354 కాన్పులు జరిగాయి. వీటిలో 174 సాధారణ కాన్పులుకాగా, మిగతావి సిజేరియన్. డాక్టర్లు లేకపోవడంతో కొందరు గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ప్రసవం పొందుతున్నారు. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు రూ.వేలల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నాయి. ఏజెన్సీ జిల్లా కావడంతో ఆర్థికలేమితో ఉన్నవారే ఎక్కువగా ఉన్న జిల్లా ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. కాగా వైద్యులు, సిబ్బంది కొరతతో పనిభారం పెరుగుతోందని, ఖాళీలను భర్తీ చేయాలని కోరేందుకు ఎంసీహెచ్ స్త్రీ వైద్య నిపుణులు, సోమేష్ కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు. కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి వైద్యులు, సిబ్బంది కొరతను తీర్చాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పాల్వంచ విమానాశ్రయానికి అనుకూలంగా లేదు

- హైడ్రా పేరుతో పేదలను ఇబ్బంది పెట్టడాన్ని ఒప్పుకోం
- అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: పాల్వంచలో విమానాశ్రయం ఏర్పాటుకు అనుకూలత లేదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విమానాశ్రయం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడులో ఏర్పాటు చేస్తే, పక్కనే గుట్టల వల్ల ఇబ్బంది ఉందని, సాంకేతిక సమస్యలు వస్తాయని తెలిపారు. అనిశెట్టిపల్లి వైపు స్థలం ఉందని, అక్కడ ఏర్పాటు చేసేలా ఆలోచన చేస్తున్నామన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ ద్వారా రూ.60 కోట్లు మంజూరవుతాయని, ఎన్‌ఆర్‌ఈజీఎస్, డీఎంఎఫ్, సీఎస్‌ఆర్ నిధుల మంజూరుకు కృషి చేస్తున్నానని, బైపాస్, రింగ్ రోడ్డు నిర్మాణం రూ.450 కోట్లతో చేపడుతామని వివరించారు. కార్పొరేషన్‌గా మారితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీలో సర్వే నంబర్లు 817, 999, 444, 727, 726లలో రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించే విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంచానని, త్వరలోనే పరిష్కారం లభిస్తుందని అన్నారు. మైనింగ్ యూనివర్సిటీ, 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, ఎన్‌ఎండీసీ విస్తరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. విలేకరుల ఇళ్ల స్థలాల సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని అన్నారు. హైడ్రా పేరుతో పేదలను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని అన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, పార్టీ నాయకులు ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, దుగ్గిరాల సుధాకర్, ఉప్పుశెట్టి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.


మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో విమలక్క, (ఇన్‌సెట్) బతుకమ్మతో...

ప్రకృతి, మహిళలను కాపాడుకుందాం..

'బహుజన బతుకమ్మ'లో ప్రజాగాయని విమలక్క

ఖమ్మంఅర్బన్: ప్రకృతి, మహిళలను కాపాడుకుందామనే నినాదంతో ఈ ఏడాది బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు ప్రజా గాయని విమలక్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఖానాపురంలో గురువారం రాత్రి జరిగిన బతుకమ్మ సంబరాల్లో ఆమె పాల్గొన్నారు. బతుకమ్మలతో పెద్దసంఖ్యలో హాజరైన మహిళలతో కలిసి ఆడిపాడిన ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌లో చెరువులను కాపాడేందుకు హైడ్రా ఏర్పాటు చేశామని చెబుతున్న ప్రభుత్వం.. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, అడవులను కాపాడుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. అలాగే, హైదరాబాద్‌కు ఆక్సిజన్ అందిస్తున్న దామగుండం అడవిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్పర్శ సామాజిక అధ్యయన వేదిక భాస్కర్, పోడకంటి రాంబాబు, లక్ష్మణ్, మేకల సుగుణాకర్, దేవిరెడ్డి విజయ్, బాలబోయిన సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా


పోలీస్ డ్యూటీ మీట్‌ను పరిశీలిస్తున్న వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం : నైపుణ్యం ఉంటే ఉద్యోగులు విధుల్లో మరింతగా రాణించొచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు హనుమకొండలో గురువారం నిర్వహించగా వరంగల్, ఖమ్మం పోలీసు కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోలీసుఅధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ పోటీలను సీపీ ప్రారంభించి మాట్లాడుతూ కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రాణించిన వారిని విభాగానికి ఇద్దరి చొప్పున హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రథమ పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామని వెల్లడించారు. పోలీస్ ఉద్యోగులు వృత్తి నైపుణ్యం సాధించడం ద్వారా కేసుల పరిష్కారంలో వేగం పెరుగుతుందని తెలిపారు. అదనపు డీసీపీ రవితో పాటు జోన్ పరిధిలోని ఏసీపీలు పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడత కౌన్సెలింగ్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండో బ్యాచ్ ప్రవేశాలకు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. మొత్తం వంద సీట్లకు గాను 15సీట్లు జాతీయ కోటాకు, 85 సీట్లు రాష్ట్ర కోటాకు కేటాయించారు. రాష్ట్ర కోటాలో తొలి విడతగా 65సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించగా ఈనెల 1నుండి 3వ తేదీ వరకు విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అలాగే, జాతీయ కోటా 15 సీట్లలో 12 భర్తీ అయ్యాయి. జాతీయ, రాష్ట్ర కోటాలో మిగతా సీట్ల భర్తీకి అనుమతి రాగానే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. కాగా, ఈనెల 14వ తేదీ నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు.

చీరల పంపిణీ సక్రమంగా పూర్తి చేస్తాం

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్


వీసీలో పాల్గొన్న ఏపీఓ జనరల్ తదితరులు

భద్రాచలం: ఐటీడీఏ, డీఆర్‌డీఏ అధికారుల సమన్వయంతో జిల్లాలో మహిళా గ్రూపుల ద్వారా చీరల పంపిణీని సక్రమంగా పూర్తి చేస్తామని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ రాజ్ అన్నారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ గురువారం హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదిలాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, కొమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని డీఆర్డీఏ, ఐటీడీఏ అధికారులతో సమీక్షించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏపీఓ జనరల్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చీరల పంపిణీని నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తామని వెల్లడించారు.

పరుపుల వ్యాపారికి బురిడీ

రూ.71 వేలు కాజేసిన సైబర్ నేరగాడు

టేకులపల్లి: సైబర్ నేరగాడు పన్నిన వలలో పడి ఓ వ్యాపారి రూ.71 వేలు పోగొట్టుకున్న సంఘటనపై గురువారం కేసు నమోదైంది. టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ సురేష్ పరుపుల షాపు నిర్వహిస్తున్నాడు. రెండు వారాల క్రితం పరుపులు కావాలని గుర్తు తెలియని వ్యక్తి నుంచి సురేష్‌కు ఫోన్ వచ్చింది. దీంతో ముందస్తు పేమెంట్ చేస్తే పరుపులు డెలివరీ చేస్తానని వ్యాపారి చెప్పాడు. కొంత సేపటికి సైబర్ మోసగాడు మళ్లీ ఫోన్ చేసి ఫోన్ పే నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ కావడం లేదని, తొలుత మీరు నగదు పంపించండంటూ సూచించాడు. మొత్తం నగదు పరుపులు డెలివరీ అయినప్పుడు ఇస్తానని మోసగాడు నమ్మబలికాడు. దీంతో నమ్మిన వ్యాపారి తొలుత రూ.10 వేలు, మొత్తం 12 దఫాల్లో రూ.71 వేలు మోసగాడి ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ చేస్తే మోసగాడు స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో ట్రేస్ చేసి మోసగాడి ఖాతాను , అందులో ఉన్న రూ.23 వేలను ఫ్రీజ్ చేయించారు. సైబర్ విభాగం నుంచి గురువారం టేకులపల్లి పోలీసుస్టేషన్‌కు కేసు బదిలీ కాగా, ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

చిన్నారుల అపహరణకు యత్నం


పిల్లలను అపహరించేందుకు దుండగుడు వినియోగించిన బైక్

కరకగూడెం: ఇద్దరు పిల్లలను అపహరించేందుకు యత్నించిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బాలురు సిరిశెట్టి కౌశిక్(11), కొంపెల్లి శ్రీనాథ్(13) కరకగూడెం ఎస్సీ కాలనీలో బతుకమ్మ వేడుకల వద్ద ఉండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. ప్రధాన రహదారి సెంటర్‌కు దారి చూపాలంటూ ఇద్దరు పిల్లలను తన బైక్ ఎక్కించుకుని వెళ్లాడు. ప్రధాన సెంటర్‌లో ఆగకుండా తాటిగూడెం వైపు వేగంగా వెళ్లసాగాడు. దీంతో తమ ఇళ్లు దాటామని, ఆపాలని పిల్లలు చెబుతున్నా వినిపించుకోలేదు. ఈ ఘటనను గమనించిన ప్రణయ్ అనే యువకుడు మరో బైక్‌పై వెంబడించాడు. కాగా బాలుడు కౌశిక్ భయపడి బైక్‌పై నుంచి దూకడంతో మొఖానికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బైక్‌ను నెమ్మదించగా మరో బాలుడు కూడా దిగాడు. అనంతరం దుండగుడు మళ్లీ కరకగూడెం సెంటర్‌కు వచ్చి తన స్నేహితులైన ఇద్దరు వ్యక్తులను బైక్‌పై ఎక్కించుకుని మణుగూరు వైపు వెళ్లాడు. అప్పటికే గమనించిన స్థానిక యువకులు వారిని వెంబడించారు. రాళ్లవాగు, కలవలనాగారం గ్రామాల వద్ద అడ్డగించినా ఆపకుండా వెళ్లిపోయారు. అనంతరం బంగారుగూడెం బ్రిడ్జి వద్ద బైక్‌ను నిలిపి మొక్కజొన్న చేలల్లోబడి పారిపోయారు. స్థానికులు బైక్‌ను తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ ఘటనపై గురువారం చిన్నారుల తండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడ్డ బాలుడికి చికిత్స అందించారు.

సీబీసీఐడీ విచారణ జరిపించాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వడంలో పాల్పడిన అక్రమాలపై సీబీసీఐడీ విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లాలో సీఎంఆర్ రైస్ విషయమై అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై రూ.400 కోట్ల ప్రజాధనాన్ని మింగేశారని ఆరోపించారు. ఈ విషయం బయటపడినా ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబించడం సరికాదని తెలిపారు. దశాబ్దకాలంగా సాగుతున్న ఈ కుంభకోణంపై సీబీసీఐడీ జరిపించకపోతే సీపీఐ ఆధ్వర్యాన ఆందోళన చేపడతామని ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య


రేణుక (ఫైల్)

ములకలపల్లి: పిల్లలు పుట్టడం లేదని భర్త, బంధువులు వేధించడంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని మూకమామిడి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మూకమామిడి గ్రామానికి చెందిన రేణుక(23)కు సుమారు రెండేళ్ల క్రితం టేకులపల్లి మండలంలోని దంతలతండాకు చెందిన భూక్యా బాబూలాల్‌తో వివాహం జరిగింది. వీరికి సంతానం కలుగకపోవడంతో భర్త బాబూలాల్‌తోపాటు అత్త, మామ, కుటుంబ సభ్యులు రేణుకను వేధింపులకు గురిచేస్తున్నారు. రేణుక చెల్లి కల్యాణితో వివాహం జరపాలని ఒత్తిడి చేస్తున్నారు. లేనిపక్షంలో విడాకులు ఇవ్వాలని, అప్పుడు తమ బంధువుల అమ్మాయితో వివాహం జరిపిస్తామని బెదిరిస్తున్నారు. వేధింపులు తాళలేక గత ఆగస్టులో రేణుక పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో మనోవేదనకు గురై గత నెల 27న పురుగుల మందు తాగింది. ఖమ్మం తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి హుస్సేని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు తెలిపారు.

గంజాయి కేసుపై నార్కోటిక్స్ సీఐ ఆరా


రఘునాథపాలెం సీఐతో చర్చిస్తున్న రాము

రఘునాథపాలెం: రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌ను జోనల్‌స్థాయి నార్కోటిక్స్ సీఐ బి.రాము గురువారం సందర్శించి స్థానిక సీఐ ఉస్మాన్ షరీఫ్‌తో సమావేశమయ్యారు. ఇటీవల రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సంబంధిత కేసు నమోదు కాగా ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై ఆరా తీసిన నార్కోటిక్స్ సీఐ రాము మాట్లాడుతూ సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో డ్రగ్స్ కేసుల విచారణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు గుర్తుతెలియని యాచకులు మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి సమీపాన బస్టాప్‌లో గుర్తుతెలియని యాచకుడు(70) అనారోగ్యంతో మృతి చెంది ఉండగా టూటౌన్ పోలీసులు గుర్తించారు. అలాగే, పాత బస్టాండ్ దగ్గర ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ సమీపంలో మరో యాచకుడు (65) మృతి చెందగా పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తన బృందంతో మృతదేహాలను మార్చురీకి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

భార్య మృతి, భర్త పరిస్థితి విషమం


సరిత మృతదేహం

బూర్గంపాడు: అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లి తిరుగు పయనమైన దంపతులను ప్రైవేటు ట్రావెల్ బస్సు మృత్యురూపంలో వెంటాడింది. సారపాక వద్ద బుధవారం రాత్రి ప్రైవేటు ట్రావెల్ బస్సు, బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టిన ఘటనలో భార్య మృతిచెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. బూర్గంపాడు ఎస్‌ఐ రాజేష్ కథనం ప్రకారం.. కుక్కునూరు మండలం పెదరావిగూడెం గ్రామానికి చెందిన నడిపింటి వినోద్‌కుమార్ తన భార్య సరితకు ఆరోగ్యం బాగోలేకపోవటంతో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యసేవలు పొందాక బైక్‌పై ఇంటికి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో సారపాక సమీపంలో మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఆటోలో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యసేవలు ప్రారంభించే క్రమంలోనే భార్య నడిపింటి సరిత (26) మృతిచెందింది. భర్త వినోద్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలించారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి అత్త సరోజిని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడిన విద్యుత్ లైన్

నేలకొండపల్లి: ఇళ్ల పైనుంచి వెళ్లిన విద్యుత్ లైన్‌తో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్న ప్రజలు తొలగించాలని విద్యుత్ శాఖ ఉద్యోగులను కోరారు. అయినా పట్టించుకోకపోవడంతో అంతా అనుకున్నట్లుగానే వైర్ తెగిపడగా తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు... నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురంలో ఇళ్ల మీదుగా వెళ్లిన విద్యుత్ లైన్ కారణంగా ప్రమాదం జరగకముందే తొలగించాలని స్థానికులు పలుమార్లు కోరారు. అయినా పట్టించుకోలేదు. ఇంతలోనే గురువారం విద్యుత్ తీగలు తెగి ఓ ఇంటి మీదుగా రోడ్డుపై అడ్డంగా పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో అప్పటివరకు సమీపాన చెట్టు కింద కూర్చున్న మహిళలు పరుగులు తీయగా రోడ్డుపై వాహనదారులెవరూ లేకపోవడంతో రెప్పపాటులో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ విషయం తెలిసిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చేరుకుని లైన్ సరిచేసేందుకు ప్రయత్నించగా ప్రజలు అడ్డుకున్నారు. అయితే, లైన్ సరిచేయకపోతే అమ్మగూడెం, రాజేశ్వరపురంతో పాటు పలు గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పడంతో శాంతించారు. కాగా, గాలిదుమారం కారణంగా తీగలు తెగి ఉంటాయని.. లైన్ మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని రాజేశ్వరపురం ఏఈ నారాయణరావు తెలిపారు.